క్లుప్తంగా

చిన్నారులకు జగనన్న ప్రీ స్కూల్ కిట్ల పంపిణీ



చిన్న పిల్లలకు కిట్లను అందిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పద్మనాభయ్య ఫ్యాక్టరీ అంగన్‌వాడీ కేంద్రంలో కౌన్సిలర్ వరదరాజులు, సీడీపీఓ డిల్లీశ్వరి, సూపర్‌వైజర్ నాగేశ్వరి పిల్లలకు ప్రీ స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. గుత్తి స్వీపర్స్ కాలనీ, చెట్నేపల్లి, ఏటీపీ రోడ్డు, చంద్ర ప్రియనగర్, కొల్లాపురం, జంగాల కాలనీ, శివ సాగర్ వెనుక, సుంకులమ్మ గుడి, గాంధీ సెంటర్, దాసరి కాలనీ తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగలక్ష్మి, గంగ, మహాలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.
పామిడి: ఎద్దులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ జీ వెంకటరమణమ్మ పిల్లలకు ప్రీస్కూల్ కిట్లను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మినారాయణమ్మ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడి రైతులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డులు

పుట్లూరు: వైఎస్సార్ చేయూత, ఆసరా కింద లబ్ధిదారులైన పాడి రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేయనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పశు వైద్య సిబ్బంది, వైకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 217 మంది లబ్ధిదారులను గుర్తించామని వారి నుంచి దరఖాస్తులు సేకరించి క్రెడిట్ కార్డులను అందజేస్తామన్నారు. పశువైద్యాధికారి నాగసువర్ణ, ఏపీఎం వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

గూడ్స్ రైలు ఢీ కొని వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన మధు

గుత్తి: గుత్తి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం గూడ్స్ రైలు ఢీ కొని మధు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్‌కు చెందిన మధు గుత్తి రైల్వే స్టేషన్‌లో ట్రాక్ దాటుతున్న సమయంలో గూడ్స్ రైలు ఢీ కొంది. ప్రమాదంలో మధు కాలు, చెయ్యి నుజ్జునుజ్జయ్యాయి. జీఆర్‌పీ పోలీసులు వెంటనే అతన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప కేసు నమోదు చేశారు.

ఆశ్రమానికి యువకుడి తరలింపు

గుంతకల్లు రూరల్: పట్టణంలోని లేపాక్షి హోటల్ వెనుక భాగాన కొంత కాలంగా ఉంటున్న నరసింహ అనే యువకుడు మతిస్థిమితం కోల్పోయి పూర్తిగా నిరాశ్రయుడయ్యాడు. టూటౌన్ పోలీసుల సమాచారం మేరకు ఆ నలుగురు సేవా సమితి సభ్యులు నరసింహకు స్నానం చేయించి, కాలుకు ఆసుపత్రిలో చికిత్స చేయించి అనంతపురంలోని ఆశ్రయ ఆశ్రమానికి తరలించారు.


బోరు ఏర్పాటుకు ఆర్థికసాయం



డీవీ కుమార్‌కు నగదును అందిస్తున్న అయూబ్

తాడిపత్రి: పెన్నానదిలో దోభీఘాట్ వద్ద కొత్త బోరు ఏర్పాటుకు అల్లారఖా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కలిగర్ మహమ్మద్ అయూబ్ శుక్రవారం సభ్యులతో కలసి రూ. 30 వేలు అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. మొత్తాన్ని రజకాభివృద్ధి సంస్థ రాష్ట్ర యువజన అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నేత డీవీ కుమార్‌కు నగదు అందజేశారు. ఇదిలా ఉండగా ఇందిరా నగర్, బంకమడి వీధుల్లో 5 ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేయించినట్లు ఏఆర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అయూబ్ తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు నజీర్‌బాషా, ఎమ్ఎస్ బాషా, రజక సంఘం నాయకులు వెంకటేష్, నాగరాజు, పెద్దయ్య, మూర్తి, శివ కుమార్, బాలన్న, చంద్ర, కొండయ్య, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



కాలిపోయిన దుస్తులు

గుత్తి: పట్టణంలోని అమృత్ సినిమా థియేటర్ వెనుక ఉన్న ఎస్సీ కాలనీలో నివాసముండే శంకర్ ఇంటిలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. మంటల్లో ఫ్రిజ్, టీవీ, ఫ్యాన్‌లు, దుస్తులు, విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఇంటిని విద్యుత్ శాఖ ఏఈ కుమార్ పరిశీలించారు.

మాయగాళ్ల మాటలకు మోసపోకండి

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లు: ఎన్నికలు సమీపిస్తుండడంతో మరోసారి ప్రజలను మభ్య పెట్టాలని ఆచరణకు సాధ్యంకాని హామీలను గుప్పిస్తున్న మయాగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని 11 వార్డు సచివాలయంలో కౌన్సిలర్ విజయలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 40 ఏళ్ల ఇండస్ట్రీ అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకు చేసిన మంచి ఏంటి ప్రశ్నించారు. ఇక వారాహి యాత్రలో పావలాకళ్యాణ్ ఎంతసేపు ముఖ్యమంత్రి జగన్‌ను విమర్శించడం, వలంటీర్లపై అడుబోసుకోవడం మినహా ఏమీ లేదన్నారు. కరోనా సమయంలో తాను దాదాపు రూ.1.50 కోట్లు నియోజకవర్గ ప్రజలకు వివిధ రూపాల్లో సాయం చేశానని గుర్తు చేశారు. అనంతరం పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వార్డు ఇంచార్జ్ ఎద్దుల శంకర్, 25వ వార్డు ఇంచార్జ్ ఫ్లయింగ్‌మాబు, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బి.సుంకప్ప. జోనల్ ఎస్సీ సెల్ ఇంచార్జ్ జింకల రామాంజనేయులు, సచివాలయం పట్టణ కన్వీనర్ ఎండీఆర్ ఖలీల్, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, మాజీ చైర్మన్ దేవేంద్రప్ప, దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వన్నూరువలి, కౌన్సిలర్లు లింగన్న, వై.సుధాకర్, నాయకులు బీకే రామచంద్ర, రంగ తదితరులు పాల్గొన్నారు.

యాడికి: మండల కేంద్రంలోని నం1 సచివాలయం, రాయలచెరువు నం:2 సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 1196 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, సర్పంచులు అనురాధా, తలారీ అరుణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, తహసీల్దార్ అలెగ్జాండర్, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, డీటీ బాలమ్మ, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకట నాయుడు, నాగరాజు, రామ్మోహన్, నాయకులు నాగేష్, రషీద్, తిరుపతి, శ్రీరాములు పాల్గొన్నారు.

యల్లనూరు: చింతకాయమంద-2 గ్రామ సచివాలయం, తిమ్మంపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ వీరరాజు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. 212 మందికి సర్టిఫికెట్లను అందించారు. ఉప సర్పంచ్ భాస్కర్ రెడ్డి, డాక్టర్ సాయి నాగశ్రీ, ఏపీఓ షబ్బీర్ బాషా పాల్గొన్నారు.

గుత్తి: స్థానిక 8వ వార్డు సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 423 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు, వైస్ చైర్ పర్సన్లు బిందె వరలక్ష్మి, పద్మలత, కౌన్సిలర్లు అంజలి, నరేష్, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు గురు ప్రసాద్ యాదవ్, బళ్లారి రాజకుమార్‌రెడ్డి, గుత్తి టౌన్ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, వార్డు ఇన్‌చార్జ్ లు హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర పాల్గొన్నారు.

పామిడి: స్థానిక గుప్తాకాలనీ సచివాలయ ఆవరణంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్, జోజోడే కుమార్, ఎంపీడీఓ డీ ప్రభాకర్ నాయక్ లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈఓఆర్డీ బీవీ శశికళ, ఈఓ చంద్రశేఖర్, ఆర్ఐ క్రాంతికుమార్ పాల్గొన్నారు.



దివ్యాంగుడికి కుల ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి



ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

జగనన్న సురక్షతో అర్హులందరికీ న్యాయం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్, టైలర్స్ కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో జేసీ సోదరుల హయాంలో ప్రజలు తమ అవసరాల కోసం నాయకుల ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో ప్రజల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయన్నారు. తాము పట్టణాన్ని అభివృద్ధి చేయాలని చూస్తుంటే కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డుతగులుతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు తాడిపత్రిలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేందుకు జేసీ సోదరులు యత్నిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జీ.రవి, డిఈ వెంకటసుబ్బయ్య, టిపిఆర్వో సతీష్‌కుమార్, ఆర్ఐ రవికిరణ్, కౌన్సిలర్ ఆకుల నాగిరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, తేజ, బాబా, సూర్యప్రభాకర్ బాబు, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి చేయూతనివ్వండి

- డీఆర్ఎంతో ఎమ్మెల్యే వైవీఆర్



డీఆర్ఎం అగర్వాల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: పట్టణాభివృద్ధికి చేయూతనివ్వాలని వై.వెంకటరామిరెడ్డి డీఆర్ఎం మనీష్ అగర్వాల్‌ను కోరారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన డీఆర్ఎంను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైల్వే సమస్యలపై చర్చించారు. గుంతకల్లు–గుళ్యపాళ్యం రైలు మార్గంలోని ధర్మవరం ఎల్‌సీ గేట్ వద్ద ఆర్‌యూబీ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కసాపురం రోడ్డులో సత్యనారయణపేట వద్ద ఉన్న రైల్వే మోరీ వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారిందని, మోరీకి ఇరువైపులా రెండేసి మార్గాలను నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య కొంతమేర పరిష్కారం అవుతుందన్నారు. పట్టణలోని బర్మశాల వద్ద పాత ఐటీసీ డిపో, హనుమేష్ నగర్‌లోని గంగానగర్ సమీపన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేస్తే స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుదన్నారు. వీటిపై డీఆర్ఎం సానుకులంగా స్పందించారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవేంద్రప్ప, మైనార్టీ నేత సీఎం బాషా ఉన్నారు.

పామిడి: మండల కేంద్రంలో నాయీ బ్రహ్మణులకు తగు సదుపాయాలను కల్పించిన ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డిని శుక్రవారం గుంతకల్లులో ఆ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, జోజోడే కుమార్, నాయీబ్రహ్మణులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతే జగనన్న లక్ష్యం

నార్పల: బడుగుల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని సుల్తాన్‌పేటలో పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సచివాలయ,వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రభుత్వ పథకాలను గడప వద్దే అందిస్తున్నారన్నారు. దీన్ని ఓర్వలేక చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, నార్పల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా అధికారి ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, వైస్ ఎంపీపీలు వెంకటలక్ష్మమ్మ, మల్లేశ్వరయ్య, ఎంపీటీసీ వెంకటరత్నమ్మ, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, మన్నీల శివయ్య, దినేష్‌రెడ్డి, గొల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సాంబశివారెడ్డి

హౌసింగ్ ఏఈగా సంపత్‌కుమార్

పామిడి: హౌసింగ్ ఏఈగా కే సంపత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఏఈగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు గుంతకల్ రూరల్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడ పని చేస్తున్న సంపత్ కుమార్ ఇక్కడికి వచ్చారు.

24లోపు పెన్షన్ ఆప్షన్ ఫారాన్ని అందజేయండి

తాడిపత్రి అర్బన్: ప్రభుత్వ పెన్షనర్లు ఈనెల 24లోపు ఎస్టీఓ కార్యాలయంలో పెన్షన్ ఆప్షన్ ఫారాన్ని అందజేయాలని తాడిపత్రి ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కత్తి లక్ష్మినారాయణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. వివరాలకు ఎస్టీఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కేసు నమోదు

యల్లనూరు: గడ్డంవారిపల్లిలో ఈనెల 15న రీ సర్వే విషయంలో పుటకల అంకన్న, అతడి అన్నదమ్ములు గట్టు విషయంలో చిన్న బాలన్నను కూలం పేరుతో దూషించి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

క్రీడల్లోనూ రాణించాలి

గుంతకల్లుటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి, ఆర్‌డీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఆర్డీటీ ఆధ్వర్యంలో గుంతకల్లు, వజ్రకరూరు మండలాల్లోని హైస్కూల్ విద్యార్థులకు అథ్లెటిక్ మీట్‌ను నిర్వహించారు.

సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: రాష్ట్ర సమగ్రామభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని నూతన కూరగాయల సమీపంలో రూ.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు వైద్యాన్ని చేరువ చేయాలన్న లక్ష్యంతోనే లక్షల వ్యయంతో పట్టన ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించామన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మరో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని పెద్దాసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చుదిద్దుతున్నామని తెలిపారు. ఇప్పటికే సగం పనులు పూర్తయ్యాయని ఏడాది లోపు పనులు పూర్తి చేసి వైద్య సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే తాడిపత్రిలో అభివృద్ధి కనపడుతోందన్నారు. సీఎం వైఎస్.జగన్ నాయకత్వంలో తాడిపత్రి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నామన్నారు. కమిషనర్ జీ.రవి, డీఈ వెంకటసుబ్బయ్య, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, ఎంపీటీసీ కిశోర్, నాయకులు హరినాథ్‌రెడ్డి, బాలరాజు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

చెట్లు లేనిదే మానవ మనుగడ లేదు

బుక్కరాయసముద్రం: చెట్లు లేనిదే మానవ మనుగడ లేదని ఆర్డీటీ ఎకాలజీ డైరెక్టర్ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. రేకులకుంటలో మొక్కలు నాటారు. ఆర్డీటీ ఎకాలజీ డైరెక్టర్ మాట్లాడుతూ రోజు రోజుకు కాలుష్యం పెరిగి పోతోందన్నారు. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఆర్డీటీ టెక్నికల్ డైరెక్టర్ బీమ లింగప్ప, విజయభాస్కర్ రెడ్డి, ఆర్డీటీ సెక్టార్ టీం లీడర్ నరసింహులు, పిరమిడ్ టీం సభ్యులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌కు బానిస కావొద్దు

గుంతకల్లుటౌన్: విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిస కావొద్దని రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సాలాబాయి, ఎన్ఎస్ఎస్ అధికారులు శివప్రసాద్, నాగమణి, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, లాయర్ చంద్రశేఖర్, భారత రాజ్యాంగ అవగాహన వేదిక అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, వేణుగోపాల్ ఉన్నారు.

మణిపూర్ ఘటనలో దోషులను శిక్షించాలి

గుంతకల్లుటౌన్: మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర నేత సావిత్రి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాలల విద్యార్థినులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో మోడీ సర్కారు ఘోరంగా వైఫల్యం చెందిందని వారు ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రంగమ్మ, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

సంక్షిప్త సమాచారం

ఈ-కేవైసీ తప్పనిసరి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ సోమశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ఏఓ మాట్లాడుతూ ప్రధాన మంత్రి కిసాన్ డబ్బు రూ.2వేలు రైతుల బ్యాంకుల ఖాతాలో జమ కావాలంటే రైతులు ఖచ్చితంగా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ చేయించుకోని రైతులు ఆయా ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు.

అభ్యంతరాలుంటే తెలియజేయండి

యల్లనూరు: ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని తహసీల్దార్ సుమతి పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో పలు పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. నెల రోజుల పాటు ఓటరు జాబితా సవరణ చేపడుతున్నామని తహసీల్దార్ తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు కిరణ్‌తో పాటు పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మెగా కంటి వైద్య శిబిరం

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం కడపకు చెందిన పుష్పగిరి వైద్యశాల కంటి వైద్య నిపుణులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 300 మంది కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 100 మందిని కడప పుష్పగిరి ఆసుపత్రికి బస్సు ఏర్పాటు చేసి శస్త్ర చికిత్స కోసం తరలించారు. మిగతా వారికి తర్వలోనే కంటి అద్దాలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. గేట్స్ ఎండీ రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్ వీకే వాణి, ప్రిన్సిపాల్ సురయ, అధ్యాపకులు, వైద్యులు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

తాడిపత్రి అర్బన్: అవుట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్మికులు మాట్లాడుతూ సకాలంలో పనిముట్లు, కొబ్బరి నూనె, సబ్బులు, యూనిఫాం ఇవ్వాలని కోరారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించి టైం స్కేల్ వర్తింపచేయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం సురక్షితం

పెద్దపప్పూరు: ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం సురక్షితమని గర్భిణులకు డా.ఉషారాణి తెలియజేశారు. శుక్రవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆమె గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గర్భిణులకు ఆరోగ్యసూత్రాలు తెలియజేశారు.

పీహెచ్ వర్కర్లను అదనంగా నియమించండి

గుంతకల్లుటౌన్: పెరిగిన పట్టణ విస్తీర్ణం, జనాభాను దృష్టిలో ఉంచుకుని ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా అదనంగా పారిశుధ్య కార్మికులను నియమించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కమిషనర్ మల్లికార్జునను సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం కమిషనర్‌కు సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, నాయకులు మారుతి, దాసరిశ్రీనివాసులు, రామునాయక్ వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రమాద సూచికల ఏర్పాటు

పెద్దపప్పూరు: మండలంలోని మచ్చుకోట అటీవీప్రాంతంలో ఇటీవల ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకోవడంతో శుకర్వారం ప్రమాద సూచికలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్ తెలిపారు. మలుపుల వద్ద 30 కిలో మీటర్ల వేగం మించకుండా వాహనాలు నడపాలని ఆయన వాహనదారులకు సూచించారు.

జగనన్న పాలనలో నిరుపేదలకు భరోసా

- ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుత్తి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో నిరుపేదల జీవితాలకు కొండంత భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం లచ్చానుపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటి వద్దకూ వెళ్లి నాలుగేళ్లలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుపేదలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో అనేక పథకాలను అందిస్తున్నారన్నారు. అర్హత ఉన్న వారికి ప్రభుత్వం స్థలం ఇచ్చి సొంతిళ్లు నిర్మించి ఊర్లు నిర్మిస్తున్నారన్నారు. పేదల సొంతింటి కల నేరువేస్తుంటే ప్రతిపక్షాలు వాటిపైనా బురద చల్లుతున్నాయన్నారు. ప్రజలకు కావాల్సిన అన్ని సేవలను ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్న వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను చంద్రబాబు, పవన్ చాలా ఘోరంగా మాట్లాడుతున్నారన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సంఘాల భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో క్యాన్సర్‌తో మృతిచెందిన మల్లికార్జున భార్య రామలక్ష్మికి రూ.10వేలు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న రంగమ్మ రూ.5 వేలు అందించారు. మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ నైరుతిరెడ్డి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, సర్పంచ్ మజ్జిగ గోపాల్, ఎంపీటీసీ లక్ష్మిదేవి, మార్కెట్ యార్డు చైర్ పర్సన్ సునీలా యాదవ్, స్థానిక నాయకులు వై. రామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కోనా అనూష్‌రెడ్డి, డి.లింగన్న, లాయర్ తిమ్మారెడ్డి, మారా రామకృష్ణ, నాగేంద్ర, ప్రసాద్ రెడ్డి, పూజారప్ప, మోహన్ రెడ్డి, నారాయణ స్వామి, పెద్దయ్య, సూర్య నారాయణ, కుళ్లాయి, అదినారాయణ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, సచివాలయ రూరల్ కన్వీనర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లచ్చానుపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి